# నేనొక్కదాన్నే

'ఆ రాతి మీద నేను. నా చుట్టూ సముద్రం. అలలు పరంపరలుగా నన్ను తాకకుండా చేతులతో నెట్టేస్తూ, సాయం కోసం దిక్కులు చూస్తూ... ఎన్ని అలలను నా శక్తితో తరిమేయగలనూ, ఓపిక పోతోంది.' అంతలో మెలకువ వచ్చింది ఆమెకు. కల కాదు వాస్తవం. చుట్టుముట్టే ఆపదలను ఎన్నని ఒంటరిగా ఎదుర్కోవడం. సముద్రం వంటి ప్రపంచం.... ఆమె చనిపోయింది ఈ వాస్తవం గ్రహించగానే...

– ఈ కొంచెం రాస్తుంటే కూడా శ్రమగానే ఉంది. ఎనిమిది నెలలు. ఇంత వికారమైన పొట్ట, కదల్లేక కదల్లేక ఈ మంచం వదల్లేక మనసంతా ఎంత విషాదమై పోతోందో. అచ్చం ఇప్పుడు అనువాదం చేసిన పద్యపాదంలాగా ఉంది. సముద్రం వంటి ప్రపంచాన్ని తట్టుకోలేకపోవడం. ఎంత మనసు తాకే ఆలోచన... లోపల పాపాయి కూడా కదులుతోంది. బహుశా దాని మనసుకి కూడా బాధా స్పృహ ఉంటుంది కాబోలు. ఏవోనబ్బా ఈ కదలటాలు. నేను కదల్లేక పోవటాలూ గొప్ప హారిబుల్. కిరణ్ పొద్దుననగా వెళ్ళిపోయాడు. ఏవిటో పేషెంటుని చూసినట్టు, గాయపడిన బుల్లి కుక్కను చూసినట్టు చూస్తాడు అదేంటో? ఎక్కడో లెక్క తప్పిందని తేలింది. ఇద్దరం కలిసే కదా బతికేందుకు నిశ్చయించాం. ఇద్దరం అన్నీ షేర్

చేసుకున్నాం కదా... అవ్వాళ బిడ్డ కనే విషయమూ 'ఏవుందీ షేరింగే' అని గొప్పగా నవ్వుకున్నట్టు మాత్రం కుదురుతుందనిపించట్లే...! ఆ రోజు కిరణ్ మొహం, ఆ కబుర్లు చూడాలి. అదేదో గొప్ప విషయం లాగా ఫీలయిపోయి, ఎలాగయినా మనకి పాపాయి ఉండాల్సిందే అని పెద్ద రొమాంటిక్ కబుర్లు చెప్పి... మరి తనకూ అదంతా ఆ రోజు బాగున్నట్లే వుంది. తీరా చూస్తే విషయం ఇది. హాపీగా రిపోర్టింగ్‌కి బైక్ మీద రివ్వుమని పోయి ఎన్నాళ్ళయిందో. వెధవ జాగ్రత్త. నన్ను కిరణ్ మోసుకుపోవడం ఏమిటో నాకర్థం కాదు. నిజానికి అతనంత గొప్ప డ్రైవర్ ఏం కాడు. ట్రాఫిక్ జామ్ అయిందంటే అతని అవస్థ చూడాల్సిందే. ఇప్పటి నుంచే ఈ సెలవూ , ఈ పొట్టతో ఏం ఆఫీసూ. ముసుగుదన్ని పడుకోవడం కూడా కుదిరి చావదు. ఏం రెస్టో బాబో... ఇంత తీరిక ఏం చేసుకోవాలో అర్థమై చావక గందరగోళంగా ఉంది. అయ్యబాబోయ్ ఏమిటిది... లోలోపల నుంచి ఏదో పారతో తవ్వుతున్నట్టు ఇదేం నెప్పి నాయనోయ్. నొప్పి తప్ప ఇంకేం అర్థం కావటంలేదు. ఎంత కంపరంగా ఉందో ఈ కనటం ప్రాసెస్సు.

అసలీ ఆస్పత్రి వాతావరణంలోనే ఏదో దిగులుంది.' లేబర్ రూమ్ ' పాయిత్రీ గుర్తొస్తోంది. ఏమందీ ఆమె! 'కలప చెక్కుతున్న రంపం మీద పొట్టులా ఉండ చుట్టుకున్న బాధ... 'కత్తిరించుకు పోతున్నట్టుంది పొట్ట... వేడిగా నొప్పొస్తోంది. ఈ శరీరం నాది కాదన్నట్టు.' మళ్ళీ నిర్మల కవితే. కాళ్ళనలా ఎడంచేసి ఒక హింసాతల పరాకాష్ఠ కోసం,... అబ్బో ఎంత సిగ్గుగా ఉందో... ఏం ముక్కడమో... ఎలా లోపలున్న పిల్లని బయటికి తీసేయడమో అసలు అర్థం కానే కావడంలేదు...

అబ్బో, ఆ పిల్లని చూస్తే నవ్వొస్తోంది. ఎర్రగా నెత్తురు వాసన కొడుతోంది పిల్ల. చిన్న కోతి పిల్లలాగా లేదూ. నర్సు నవ్వుతోంది. నీకు మల్లే నీ కూతురు చాలా అందగత్తె అంటోంది. అవును. నేను ఎంత అందంగా ఉంటానో వినటం ఎన్ని వందల సార్లో. కిరణ్ తోటివాళ్ళు. ఆ జర్నలిస్టు గుంపులంతా తిరిగి తిరిగి చివరికి కిరణ్‌గాడు ఎలాగయితేనేం ప్రపోజల్ పెట్టేశాడు. అదేవిటో ఎంత తొందరగా వొప్పేసుకున్నానో... భలే ఆశ్చర్యం. కిరణ్ గురించి ఏం ఆలోచించాను. ఫర్వాలే. అందంగాడే. ప్రతిదానికీ తిరగేసి మాట్లాడే తిక్కతనం. కాస్త బుర్ర తక్కువ. యూ పోనీ ...వీడొట్టి జర్నలిస్టూ! అంతవరకే గానీ, ఇంకా నయం కవో, కథకుడో కాదు. ఆ ఇగోలు, పిచ్చి పిచ్చి రాతలూ తలకాయి నెప్పి లేకుండా తను రాసిన ఐటమ్ తప్పించి పక్కవాడి వంక కూడా తొంగి చూడనంత తెలివి బాబో? మూర్ఛపడిపోయి వీడిని పెళ్ళి చేసుకుంటే ఇప్పుడీ పిల్ల! వంకర టింకరగా మొఖం చిట్లించి నోరు తెరిచి అదేవిటో కటిక్కిన మూసుకుంటుంది. ఇంతకీ దీనికి కళ్ళు కనిపిస్తూనే ఉన్నాయా? కొంపదీసి లేవా. అలా అయోమయంగా చూస్తుందేవిటి? ఆ రాధాకృష్ణకి మల్లే కళ్ళు లేకపోతే... అతను భలేవాడు.

చేయి ఇలా ముట్టుకుని ఎన్ని సంవత్సరాల తరువాత అయినా ఈ స్పర్శ నాకు జ్ఞాపకమే అంటాడు. మనం కల కంటాం కదా... అతను కల విన్నాం అంటాడు. అంతే కదా! అతనికి దృశ్యాలకి సంబంధించిన ఫీలింగ్స్ ఎల్లా వస్తాయి? పాపం అతని అనుభూతులన్నీ వినికిడికి సంబంధించినవే కదా... అతనితో ఎంతో స్నేహం చేయాలని అనిపిస్తుంది. కానీ ఎల్లా, మనకి సంబంధించిన అనుభూతులన్నీ అనుభవాలన్నీ మన చూపుకి సంబంధించినవి. మన కళ్ళల్లోంచి, అవన్నీ మనకు కమ్యూనికేట్ అవుతాయి... మరి అతనికి? అతనికీ శబ్దానికీ అనుబంధం. అతనితో స్నేహం ఓ కొత్త అనుభవం.... అనుభవం అంటే గుర్తొస్తుంది. ఇందాక బిందు ఏమందీ? ఈ అనుభవాన్ని ఎల్లా చెప్పగలవు గీతా అంది. అవును. ఎలా చెప్పనూ. తొమ్మిది నెలలు ఎంతో బోర్ కొట్టింది. శరీరం అడ్డదిడ్డంగా పెరిగిపోయింది. కాంప్లికేషన్స్ వస్తే మందులు మింగాల్సి వచ్చింది. రకరకాల టెస్టులు. కిరణ్ కేం తెగులు. హాయిగా వచ్చి డ్రింకులు తాక్కుంటూ ఆస్పత్రి వాకిట్లో పచార్లు చేశాడు. పైగా వెధవ చాకిరీ చచ్చినట్టు నేనొక్కడ్ని చేస్తున్నానని సణుగుతాడు. అన్నం వండటం కూడా అతనికి పెద్ద పని. అసలా పిల్లని మోయటం అంతకంటే కష్టం కదా!

కాఫీ ఫ్లాస్కు మోసుకుంటూ పళ్ళికిలించుతూ వచ్చాడు. పిల్లని చూసి వేలితో తాకి అదేం మురిసిపోవడం. పైగా నాకు థాంక్సట.... ఎందుకో... తనకి గర్వంగా వుందిట. తనదేం పోయిందీ... అతనికెందుకు గర్వమో ఎంత చచ్చినా అర్థం కాదు. మైమరచిపోతూ అదేదో తెలుగు సినిమాలోలాగా, చేయి పట్టుకుని అలా ఫ్రీజయిపోయాడు. ఎంత గొప్ప అనుభూతి ఇది అంటాడు పొయిటిక్‌గా. నాకేం అనుభూతులు లేవబ్బా. ఆస్పత్రి కంపూ, ఇందాక ఆ డెలివరీ వార్డులో నా పొజిషనూ, రక్తం ఓడుకుంటూ ఇలా మంచం అతుక్కుని పడుకోవడమూ ఇదంతా ఏం ఫీలింగ్! కిరణ్ మొహం చిట్లించుకుని... ఫీలయిపోయాడు. నేను మాత్రం గర్వంతో ఉండాలిట. అదేదో తిట్టులాగా వినిపించింది. ఏవిటో సోదికబుర్లు చెబుతాడు. పిల్లల్ని పెంచడం పెద్ద కష్టం కాదట. మా అమ్మా, వాళ్ళమ్మా హాయిగా కని పెంచారట. ఏం పెంచడం, చచ్చి సున్నమై పోయి ఉంటారు. అసలు మా అమ్మకి పిల్లలంటే పెద్ద సరదానే లేదు. మమ్మల్ని పెంచడంతోనే ఆవిడ సర్వ ఓపికా అయిపోయిందిట. టీచరు ఉద్యోగం, ఇంట్లో చాకిరీ, నేనూ అన్న... మా బాధ్యత... నాన్న ఉన్నా, పాపం అమ్మే చాలా పనులు చేసీ చేసి అలసిపోతూ వుండేది. ఆవిడ్ని చూశాకే బుద్ధొచ్చింది. కిరణ్‌తో ప్రేమ కథలకంటే ఈ బాధ్యతల పంపకాలే ఎక్కువ చెప్పుకుని ఉంటాను నేను. ఇక నుంచి అంతే బాబూ... ఈ పిల్లా అంతే... అతనూ నేనూ షేర్ చేసుకోవాల్సిందే. నిద్రొస్తోంది. హాయిగా సుఖంగా నిద్రపోవాలని పక్కకు తిరిగి పడుకుంటుంటే ఏవిటో ఇబ్బందిగా. అబ్బో... ఇదేమిటే పాలొచ్చేస్తున్నాయి. ఈ వాళ్ళ నొప్పులూ భారం ఇదన్నమాట. డాక్టరొచ్చేసి, పిల్లని తల్లి దగ్గరికి ఇవ్వండి. పాలు తాగేట్టు పిల్లకి అలవాటు చేయి అంది. అదో తతంగం. దానికి పాలు సక్ చేయడం రాలేదు. నర్సూ

నేనూ ఇద్దరం కలిసి నా రొమ్ములు లాగి దానికి అందించేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. వికారం వచ్చేస్తోంది.

అది సరిగ్గా తాగలేదు. మళ్ళా మొత్తం తతంగం. నేనేదో పాల డ్రమ్ములాగా అయిపోయినట్టుంది. అలా వచ్చేస్తున్నాయి పాలు. పిల్ల గంట గంటకీ తాగడం, పడుకోవడం, నిద్రపోవడం, ఏడవడం, మళ్ళీ పాలు. దానికి రెండో పని లేదు. అస్తమానం తాగటమే. ఉచ్చలు పోసేయడం. నేను లేవటం పక్క మార్చటం. పంతానికి కిరణ్‌ని తిట్టి కూర్చోబెట్టినా అతనేం చేస్తాడు. నాకు గుండె జారిపోతోంది. ఆదమరచి నిద్రపోదామంటే లేదు. పిల్లకి గొంతెండి చచ్చిపోతుందేమోనని భయం. పాపం దానికి ఏడవటం కూడా గట్టిగా ప్రాక్టీస్ లేదు కదా. అదేవిటో వళ్ళు ఇలా విరుచుకుని మొకం వంకర్లు తిప్పుకుని కుయ్ కుయ్ మని దీనంగా మొదలుపెడుతుంది. పిల్లని కంటే పనయిపోయిందనుకుంటే ఇల్లాగయిపోయింది. రిపోర్టింగ్‌లు, ద్వారకా హోటల్లో గప్పాలు, ఫ్రెండ్స్... ఇదంతా గంటల్లో మటాష్ అయిపోయింది. తేలిపోలేదూ ఈ పిల్ల అచ్చంగా నాదే. దానికి సర్వ చాకిరీల్నిచేసి కనిపెట్టుకుని ఉండే బాధ్యత నాదే. క్రెచ్‌లో పడేసినా రాత్రిళ్ళు తెచ్చుకోవాల్సిందే కదా. భయం వేస్తోంది దాన్ని చూస్తుంటే. ప్రేమగా ఎందుకు లేదో అర్థం కాదు. ముందుగా కంగారయిపోతోంది. నేనే ఆహారం దానికి. అది నన్ను నమ్ముకుని ఉంటుంది. వచ్చినట్టు భద్రంగా ఉండాల్సిందే. పిల్ల బాధపడితే చూడలేం కదా మరి. వీటన్నింటి మధ్య కిరణ్, హాయిగా టైప్ రైటర్ తెచ్చుకుని పుట్టినే దండక్కి, పిల్లకి మెలకువ వచ్చేంత స్పీడ్‌గా టైప్ చేస్తూ, దాని ఉయ్యాల పక్కనే మఠం వేసుకుని కూర్చుంటాడు. ఏం ఉపయోగం అతనివల్ల. పైగా పిల్లని జాగ్రత్తగా ఎత్తుకోవటం కూడా గొప్పే అతనికి. సో తేలిందేవిటంటే పిల్లతో అతనికి ఎలాంటి బాధ్యతా లేదు. ఈ పిల్ల నాకు లంకె. నా ఉద్యోగం, నా స్వేచ్ఛ, నా సాయంత్రాలు అన్నీ లాగేసిన పిల్ల మీద నాకు అనుబంధం ఉండాలట. ఎల్లా ఉంటుందో నాకు అర్థం కాదు. డిప్రెషన్ వచ్చేస్తోంది. మనసు దిగులు దిగులుగా అయిపోతోంది. పిల్ల మన మీద డిపెండయి ఉంటుంది. దాన్ని ఎలా తోసేస్తాం. అలాగని ఎంతకని భరిస్తాం. పిల్లకి పాలు, తిండి, నిద్ర దాని సొంత పనులన్ని చేసి దాన్ని భరించాలా... ఎంత పెద్ద బాధ్యత. టెన్షన్‌గా ఉంది. భయంతో వణుకొస్తోంది. హాయిగా నిద్ర పోతుంటే నిద్రలో ఆలాపన. చెవుల్లో పిల్ల ఏడుపు. సన్నగా దీనంగా వినిపిస్తోంది. రొమ్ముల్లో పాలు వచ్చేస్తాయి. మెలకువ వచ్చేస్తుంది. గుప్పిళ్ళు మూసుకుని ఆ పిల్ల హాయిగా నిద్రపోతూ ఉంటుంది. దాని ఉయ్యాల కిందనే కాయితాలు పరుచుకుని కిరణ్ కూడా నిద్రపోతూ కనిపిస్తాడు. నిద్ర తూలిపోతూ, నిద్రపోవాలని తపించిపోతూ నిద్రలేని కళ్ళతో నేను. తల్లి ప్రేమ అంటే నేను పిల్ల వంక చూసే వెర్రిచూపులేనని ఎవరైనా అంటే వాళ్ళకి వేలవేల నమస్కారాలు. నిద్రలో కూడా కళ్ళనిండా నిద్రపోలేని తల్లులు కనిపిస్తున్నారు. భయం భయంగా... పిల్లల వేపు చూస్తూ ఉంటారనిపిస్తుంది. చెవుల్లో హోరుమంటోంది. చేతులు నెర్వస్‌గా వణికిపోతుంటాయి. మనసులో భయం భయంగా...

చీకట్లోంచి కూడా పిల్లవేపు చూస్తూ నేను. ఎంత వద్దనుకున్నా పిల్ల కోసం గట్టిపడిన రొమ్ములు పిండుతూ నర్స్, నేను, ఆ రాత్రి మేమిద్దరం ఆడవాళ్ళం ఆ పిల్ల పాలు చీకుతూ తాగేందుకు చేసిన ప్రయత్నం కళ్ళ ముందుకి వస్తోంది. పొద్దుట పేపర్లో బాక్స్ ఐటమ్. అక్కడెక్కడో పోలీసులు, మొగుడు నక్సలైట్ ఇన్ఫార్మర్ అన్న అనుమానంతో అతని భార్య రొమ్ములు పట్టుకుని పాలు పిండేరట. ఆ దృశ్యం వద్దన్నా వెంటాడుతోంది. అసలు ఆడ శరీరమే సెక్స్‌కి అనుకూలంగా ఉందని గ్రహించి దాని మీద పేటెంట్ హక్కులు పొందే మగవాళ్ళ మధ్యని బతుకుతున్నవాళ్ళు). ఆ మగాళ్ళు ప్రేమగా వుంటే తాకుతారు. ఆకలిగా చూస్తారు. అధికారం ఉంటే పిండుతారు. మనల్ని శరీరమే మోసం చేస్తోంది. ఎదుటి మనిషికి ఇన్ని రకాలుగా పనికివచ్చే అవకాశం ఉంటే ఎవరైనా ఏం చేస్తారు? అదంతా సరే. ఎలాగో ఏదో అవుతోంది. ప్రపంచం ఎలాగో అలాగూ నడిచిపోతోంది. కానీ ఇదేమిటి? చాలా సహజమైన విషయం. ఇంత భయంగా ఉందేమిటో విచిత్రంగా ఉంది. నా మీద ఆధారపడ్డ పిల్లని చూస్తే నాకు భయం. పళ్ళు కటకట మంటున్నాయి. కాళ్ళు తేలిపోతున్నాయి. కళ్ళు మూతలు పడిపోతున్నాయి. అయినా భయం. పాపాయికి ఆకలేమో? ఏడుస్తుందేమో? అదేమిటో అయిపోతోంది వళ్ళు. స్వాధీనం తప్పుతున్నట్టుగా నాకేవిటో అయిపోతోంది. మరి పాపాయీ, నీకెల్లాగే . నేన్నీకు అమ్మని. అయినా నువ్వంటే నాకు భయమెందుకే... కలొస్తోంది. నేను రాసినట్టుగానే చుట్టూ సముద్రం. అన్నీ ముంచెత్తే అలలే. నేనొక్కదాన్నే ఎంతకని నెట్టివేయను. ఓపిక తగ్గుతోందమ్మా. నన్నెవరన్నా ఆదుకోరూ.

★

ఆదివారం ఆంధ్రజ్యోతి

***15.3.1998***